క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాడ్మింటన్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని విద్యార్థులు చదువులతోపాటు క్రీడలలో రాణించాలని ఎస్ఐ విశ్వనాథనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో యూత్ నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా క్రీడలు ఆడితే ఆరోగ్యంగా ఉంటారని, ఎలాంటి జబ్బులు రావని తెలిపారు. ప్రతిఒక్కరూ క్రీడలపై మక్కువ చూపాలన్నారు. టోర్నీ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భారీ వర్షం



బుచ్చినాయుడుకండ్రిగలో కురుస్తున్న భారీ వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో భారీ వర్షం కురిసింది. ఎండ వేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు భారీ వర్షంతో ఉపశమనం కలిగింది. వాతావరణం చల్లబడింది. వర్షం పడడంతో వరి, వేరుశనగ పంటల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పొలాలను దుక్కులు దున్ని వరి పంట వేయడానికి రైతులు సిద్ధం అవుతున్నారు.

సత్యవేడు ఈఓపీఆర్డీగా తరుణ్ కృషి రెడ్డి

సత్యవేడు: మండల పంచాయతీ రాజ్ విస్తరణాధికారిగా తరుణ్ కృషిరెడ్డి నియమితులయ్యారు. తొట్టంబేడులో ఈఓపీఆర్డీగా పని చేస్తున్న ఈయనను సత్యవేడుకు బదిలీ చేశారు. అలాగే తిరుపతి సాయినగర్‌లో పనిచేస్తున్న సెక్రటరీ రాజేష్‌ను కొల్లండం పంచాయతీ సెక్రటరీగా, ఏర్పేడు మండలం గోవిందవరం కార్యదర్శి బాలాజీని మల్లవారిపాళెం వెస్ట్‌కు, చెన్నంపల్లె నుంచి చిన్నఈటిపాకంకు సుబ్రమణ్యం, తిరుచానూరు నుంచి సత్యవేడు రెండో సచివాలయానికి శ్రీనివాస్, చంద్రగిరి మండలం శానంబట్ల నుంచి జడేరికి లోకేష్, చంద్రగిరి నుంచి వెంకటరాజుల కండ్రిగకు శివయ్య, సత్యవేడు ఇరుగుళంలో పనిచేస్తున్న ప్రకాష్ వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లెకు, దాసుకుప్పంలో పనిచేస్తున్న రమణమూర్తిని నాగలాపురం మండలం టీపీకోటకు, మదనంబేడు సెక్రటరీగా పనిచేస్తున్న మాధవిని పుదుకుప్పం, సత్యవేడు మండలం జడేరి సెక్రటరీగా పనిచేస్తున్న వాసును రేణిగుంట మండలం కృష్ణాపురానికి బదిలీ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.

ఇసుక తరలింపునకు అనుమతి తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఇసుక, గ్రావెల్ మట్టిని అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు సుబ్రమణ్యం తెలిపారు. ఆయన సోమవారం తహసీల్దారు కార్యాలయంలో మట్టి, ఇసుక తరలింపుపై ఎస్ఐ విశ్వనాథనాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కాళంగి నదిలో ఇసుక రీచ్‌లు లేవన్నారు. ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. చెరువులలోని మట్టిని అనుమతి లేకుండా తరలించకూడదని తెలిపారు. ప్రభుత్వ పనులు, ఇంటి అవసరాల కోసం తప్పనిసరిగా సంబంధితశాఖ అధికారుల వద్ద పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణ



శ్రీ మహాలక్ష్మి అలంకరణలో మరకదాంబిక అమ్మవారు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వరస్వామి దేవస్థానంలో మరకదాంబిక అమ్మవారికి యాగశాల మండపంలో కలశపూజ, వేదపారాయణం, కుంకుమార్చన పూజలు చేశారు. మరకదాంబిక అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వంతెనల నిర్మాణం కలేనా?

మండలంలోని అరుదూరు మార్గంలో వంతెనల నిర్మాణం కలగా మారింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిపాదనలు అటకెక్కడంతో వంతెనల నిర్మాణం ఎప్పటికోననే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రభుత్వం వంతెనలు నిర్మించి ఇబ్బందులు లేకుండా చేయాలని పలువురు కోరుతున్నారు.

- అరుదూరు మార్గాన్ని పట్టించుకోని పాలకులు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గత ఏడాది అరుదూరు మార్గంలో వర్షపునీటితో నిండిన వాగులో నెట్టుకువస్తున్న స్కూటరిస్టు (ఫైల్)

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం నుంచి అరుదూరు మీదుగా కంచరపాళెం వరకు 4కిలోమీటర్ల మేరకు పంచాయతీరాజ్ శాఖ రోడ్డు ఉంది. గతంలో ఇది పూర్తిగా మట్టి రోడ్డుగా ఉండేది. 2007లో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆ రోడ్డు బీటీ రోడ్డుగా మారింది. అయితే ఆ రోడ్డులో రెండు చోట్ల కరుణానదికి వెళ్లే రెండు కాలువలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో వంతెనలు నిర్మించాల్సి ఉంది. రోడ్డు పనుల కోసం గతంలో మంజూరైన నిధుల్లో లో లెవల్ కాజ్‌వేల ఏర్పాటుకు మాత్రమే ప్రభుత్వం నిధులు కేటాయించింది. లో లెవల్ కాజ్‌వేల నిర్మిస్తే వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సంబంధిత పంచాయతీల ఇంజినీరింగ్ అధికారులు హైలెవల్ వంతెన నిర్మాణానికిగాను 12 ఏళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం పట్టించుకోలేదు. లోలెవల్ కాజ్‌వేలకు మంజూరైన నిధులు కూడా సమయం దాటిపోవడంతో వెనక్కి మళ్లాయి. రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ వంతెనల నిర్మాణం జరగగపోవడంతో సమస్య యథాతథంగా ఉంది.

వర్షాకాలం వస్తే చుట్టుకురావాలి

వర్షాకాలంలో అరుదూరు ప్రాంత ప్రజలు వరదయ్యపాళెం రావాలంటే చుట్టుకుని రావాల్సిందే. 3కి.మీల దూరంలో ఉన్న వరదయ్యపాళెంకు అటు వైపుగా 8కి.మీల దూరం చుట్టుకుని రావాలి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వర్షానికి కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన మార్గంలో అవస్థలు మోటార్ సైక్లిస్టుల అవస్థలు

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన

మండలంలోని శ్రీ కల్కి గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా అరుదూరు మార్గంలోని ఒక కాలువ వద్ద 2016లో రూ.లక్షతో నిర్మించిన తాత్కాలిక వంతెన 2017లో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. ఆ సమయంలో మరోమారు తాత్కాలిక వంతెనకు మరమ్మతులు చేసి రాకపోకలను కొనసాగించారు. అయితే రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలకు మరోసారి తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. వాహనదారులతోపాటు స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి



అరుదూరు మార్గంలో వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలి. లేదంటే రానున్నది వర్షాకాలం కావడంతో మళ్లీ మా గ్రామస్తులకు కష్టాలు తప్పవు. రాకపోకలకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది.

-రామకృష్ణారెడ్డి, అరుదూరు

ప్రభుత్వం చొరవ చూపాలి



అరుదూరు మార్గంలో లో లెవల్ కాజ్‌వేల నిర్మాణం నిమిత్తం మంజూరై వెనక్కి మరలిన నిధులను తిరిగి ప్రభుత్వం మంజూరు చేసి నూతన వంతెనల నిర్మాణం కోసం చొరవ చూపాలి. వర్షాకాలం వస్తే మా ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ఫుల్‌స్టాప్ పెట్టే దిశగా చర్యలు తీసుకోవాలి. -శ్రీధర్ రెడ్డి, సర్పంచ్, అరుదూరు

మండల సర్వేయర్‌గా రాజ్‌కుమార్



సర్వేయరు రాజ్‌కుమార్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల రెవె న్యూ సర్వేయర్‌గా రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మునస్వామి అనారోగ్యంతో శెలవుపై ఉన్నారు. దీంతో నెల్లూరు సిటీలో పనిచేస్తున్న రాజ్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

రేణిగుంట: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో రేణిగుంట బాలికోన్నత ప్లస్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని హెచ్ఎం విష్ణువర్ధనం సోమవారం తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా నున్న జెడ్పీ హైస్కూల్లో ఇటీవలే నిర్వహించిన ఈ పోటీల్లో తమ విద్యార్థినులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. అండర్-19 విభాగంలో ఒక బంగారు, రెండు కాంస్య, అండర్-14 విభాగంలో నాలుగు రజత, ఒక కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. ప్రతిభ చాటిన విద్యార్థినులు త్వరలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

శోత్రియ భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు

- అక్రమార్కులు ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవు
- తహసీల్దార్ రాజశేఖర్ హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..



శోత్రియ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని పాదిరికుప్పం రెవెన్యూలోని శోత్రియ భూముల్లో ఇటీవల రాత్రికి రాత్రే దున్ని అక్రమార్కులు పాగా వేస్తున్న విషయమై 'భూతాళ మాంత్రికులు' శీర్షికతో ఈ నెల 3న సాక్షిదినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన తహసీల్దార్ రాజశేఖర్ క్షేత్రస్థాయిలో శోత్రియ భూములను పరిశీలించారు. అక్రమార్కులు ప్రవేశిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణలకు పూనుకుంటే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం శోత్రియ భూముల్లో స్థానిక వీఆర్వో చలపతి, సిబ్బందితో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

ముక్కంటి సేవలో మంత్రి



ఆలయం వద్ద మంత్రి సంధ్యా రాణి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాష్ట్రమంత్రి సంధ్యా రాణి దర్శించుకున్నారు. ఆమెకు దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నాగలాపురం పంచాయతీ కార్యదర్శిగా రమేష్



రమేష్‌చంద్ర

నాగలాపురం: మేజర్ పంచాయతీ నాగలాపురం పంచాయతీ కార్యదర్శిగా రమేష్ చంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన నాగరత్నమ్మను కార్వేటినగరానికి బదిలీ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రమేష్‌చంద్ర గాజులమండ్యం నుంచి ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ఉన్నతాధికారులు అందరి సహకారంతో నాగలాపురం మేజర్ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఇది మాయదారి ప్రభుత్వం



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, సంఘమిత్రలు తదితరులు

- చిరుద్యోగులపై కూటమి ప్రతాపం
- ఓ చోటా నాయకులు కనుసన్నల్లో తొట్టంబేడు మండలం
- కూటమి నేతల తీరు మారకుంటే ప్రజాగ్రహం తప్పదు

శ్రీకాళహస్తి: ప్రజల్ని వంచించి... చిరుద్యోగులను వేధించే ప్రభుత్వం మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ మాయదారి ప్రభుత్వమని మండిపడ్డారు. తొట్టంబేడు మండలం వెలుగు కార్యాలయం వద్ద సోమవారం సంఘమిత్రలు, గ్రామస్తులతో కలిసి సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరిపుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను నెరవేర్చడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో వెనుకబడిందని విమర్శించారు. కూటమిలోని రాజకీయ నిరుద్యోగులకు లబ్ధి చేకూర్చేందుకు అధికారంలోకి వచ్చిన రోజు నుంచి స్కీమ్ వర్కర్లే లక్ష్యంగా వేధింపులు మొదలుపెట్టారన్నారు. నిరుద్యోగులను వేధించే ఏ ప్రభుత్వానికీ పుట్టగతులు ఉండవన్నారు. శ్రీకాళహస్తి నియోకవర్గంలో స్కీం వర్కర్లను లక్ష్యంగా చేసుకుని కూటమి నేతలు పెద్ద ఎత్తున దౌర్జన్యకాండ సాగిస్తున్నారంటూ కొన్ని సంఘటనలను ఉదహరించారు. గత ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారనే నెపంతో దళిత సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగనవాడీలు, ఆయాలు, ఆశా వర్కర్లు, స్కూల్ ఆయాలను పెద ఎత్తున తొలగించారన్నారు. తొట్టంబేడు మండలంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఓ నాయకుడు ప్రతి గ్రామంలో సంఘమిత్రలను ఇబ్బంది పెడుతూ వారిని నిలిచిపోయేలా ఇబ్బందులకు గురిచేసి తొలగిస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు ఇది తెలిసినా ప్రేక్షకుని పాత్ర వహిస్తున్నారని విమర్శించారు. ఇకనైనా కూటమి నేతల తీరు మారకుంటే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గంధం మణి, వేణు, రాజా, చందన్‌కుమార్, సంఘమిత్రలు, సరస్వతి, రేవతి, భూలక్ష్మి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాహిమాం మాతా.. పాహిమాం




అశ్వరూఢాదేవిగా బజారువీధి వాసవీ కన్యకాపరమేశ్వరి



స్కంధ మాతగా బొమ్మల కొలువులోని జ్ఞానప్రసూనాంబ



లలితాదేవి అలంకారంలో కనకదుర్గమ్మ



మొక్కజొన్న కంకులతో అలంకృతురాలైన ముత్యాలమ్మ



అశ్వాసుర వధ అవతారంలో ఆలయంలోని జ్ఞాన ప్రసూనాంబ

శ్రీకాళహస్తి: పాహిమాం తల్లీ.. పాహిమాం..అంటూ వివిధ ఆలయాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 5వ రోజు సోమవారం పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ అమ్మవారు అశ్వాసురవధ అవతారంలో భక్తులను కటాక్షించారు. విశేష పూజల అనంతరం అమ్మవారిని రంగుల గోపురం వరకు ఊరేగించారు. ఇక ఆలయంలో బొమ్మల కొలువులోని అమ్మవారు స్కంధ మాతగా, అలాగే ఆలయంలోకనకదుర్గమ్మ, కనకాచలంపై ఉన్న కనకదుర్గమ్మ ప్రత్యేక అలంకారంలో కొలువుదీరారు. సంత మైదానం అంకాళమ్మ, మూకేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు ప్రత్యేకాలంకారంలో దర్శనమిచ్చారు. పానగల్‌లోని గంగమ్మ మంగళగౌరిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి అశ్వరూఢాదేవిగా, భాస్కరపేటలోని చాముండేశ్వరి దేవి ముత్యాలమ్మగా, శీతాలాంబ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా పార్వతీదేవి

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లె పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పార్వతీ దేవి లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మర్రిమంద మాతాశ్రీ ఆశ్రమంలో రాజరాజేశ్వరీ దేవి, ఎండీపుత్తూరు యల్లమ్మ దేవి, పాతవీరాపురం చెంగాళమ్మ దేవి, పాపానాయుడుపేట భద్రకాళీదేవి, కోబాకలో పోలినాంచారమ్మ, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని ఆనందవల్లీ దేవి అమ్మవార్లు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో పూజలు అందుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

కరిమారియమ్మగా అవనాక్షమ్మ

నారాయణవనం: శరన్నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు మరుమారియమ్మగా భక్తులకు ఊంజల్‌సేవలో దర్శనమిచ్చారు. స్థానిక టీటీడీ ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. అలాగే కైలాసనాథకోనలో కామాక్షాంభిక అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, తిరువట్యంలో మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కాళికాదేవిగా సర్వమంగళాదేవి దర్శనం

సత్యవేడు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు సర్వమంగళాదేవి అమ్మవారు భక్తులకు శ్రీ కాళికాదేవిగా దర్శనమిచ్చారు. సోమవారం సర్వమంగళాదేవి అమ్మవారిని వివిధ రకాల పండ్లతో శ్రీకాళికాదేవిగా అలంకరించారు. దుష్టశక్తుల బారిన పడి అనారోగ్యంతో అవస్థలు పడుతున్న పిల్లలు, మహిళలు కాళికాదేవిని దర్శించుకుని అర్చనలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త రవి కుమార్ దేవర్ దర్శన వసతులు కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.



ఏర్పేడు: మర్రిమంద మాతాశ్రీ ఆశ్రమంలో..



ఏర్పేడు: చిందేపల్లెలో..



ఏర్పేడు: పాతవీరాపురంలో



కరిమారియమ్మగా అవనాక్షమ్మ



కైలాసనాథకోనలో అన్నపూర్ణాదేవిగా కామాక్షాంబిక



గాయత్రీదేవిగా మూలస్థాన ఎల్లమ్మ



సత్యవేడు: సర్వమంగళాదేవి శ్రీకాళికాదేవిగా దర్శనం

శివయ్యా.. ప్రసాదాల కొరతయ్యా..!



శ్రీకాళహస్తి ఆలయంలోని ప్రసాద విక్రయశాల

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వయాలయంలో సోమవారం ప్రసాదాలు కొరత తలెత్తడంతో క్యూలో వేచి ఉన్న భక్తులు నిరాశతో వెనుదిరిగారు. శ్రీకాళహస్తి ఆలయానికి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ప్రసాదాల కౌంటర్‌లో భక్తులకు చిన్న లడ్డూ, పెద్ద లడ్డూ, పులిహోరా, వడ, జిలేబీ అందుబాటులో ఉంటాయి. జిలేబీ మాత్రం తక్కువ సంఖ్యలో తయారుచేయడంతో ఉదయానికే అయిపోయాయి. ముఖ్యంగా ఈ ఆలయంలో లభించే పులిహోరా ప్రసాదాన్ని భక్తులు మహా ప్రసాదంగా స్వీకరిస్తారు. అయితే సోమవారం మధ్యాహ్నం 2గంటలకే పులిహోరా ప్యాకెట్లు అయిపోవడంతో పులిహోరా లేదని, కేవలం లడ్డూ, వడ మాత్రమే ఉందని ప్రసాదాల కౌంటర్ సిబ్బంది చెప్పడంతో అప్పటివరకు క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు నిరాశతో వెనుదిరిగారు.

స్వామి దర్శనానికి ఇన్ని ఆంక్షలా..?

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయ పరిసరాల్లో ఉన్న గ్యాలరీల్లో ఉంటూ స్వామి వారి వాహన సేవలను తిలకించి మురిసిపోతారు. ఈ ఏడాది టీటీడీ ఇనుప కంచెలు ఏర్పాటుచేయడంతో భక్తులు స్వామిని తనివి తీరా దర్శనం చేసుకోలేకపోతున్నారు. మరోవైపు శ్రీవారి ఆలయం ముందున్న గ్యాలరీల్లోకి భక్తులను అనుమతించకపోవడంతో ఆ ప్రాంగణమంతా ఖాళీగా కనిపిస్తోంది. మరికొన్నిచోట్ల భక్తులను లోపల ఉంచి గేట్లకు తాళాలు వేస్తున్నారు. గరుడ సేవ రోజైనా తమకు స్వామివారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి